

# జాతకం

కథానిక

రాత్రి మెయిలు టపా తీసుకొనిపోయే ఆ 'డెకోటా' విమానంలో రాజూ, రెడ్డీ యెక్కిన తరువాత మేము సాగనంపి వచ్చేవరకూ-వాళ్లిద్దరి విదేశ ప్రయాణం జరుగుతుందని అనుకోలేదు. విమానం అల్లంత యెత్తు పైకిలేచింది. జుమ్మనే మృదుమధుర విమానసంగీతం మాచెవుల్లో సుఖంగా ప్రతిధ్వనిస్తోంది. నిర్మలమైన ఆకాశం, అనంత కోటి నక్షత్రాల ఆహ్లాదకాంతులు, ఆ నక్షత్రాల పంక్తులను చీల్చుకొంటూ రంగురంగుల ఎరుపు, పచ్చదీపాలతో డెకోటా విమానం మెల్లగా సాగిపోతూవుంటే, మిత్రులను సాగనంపి కారులో తిరిగివస్తూవున్న మాకుకూడా వారితో ప్రయాణం చేస్తూ వున్నట్టే అయింది. విమానం ఎక్కి యు. కె., యూరప్, యు. యస్. ఏ. దేశాల పర్యటనకోసం బయలుదేరిన మా మిత్రుల మనస్సుల్లో ఊహాలు కారులో ఉన్న మేము నలుగురమూ ఊహించుకొంటున్నాం. సాగనంపడానికి వెళ్ళిన వాళ్ళల్లో నేను, జాన్, శాస్త్రిగారు, ఆయన భార్య.

"రాజు చాల పట్టుదలకల మనిషి" అని శాస్త్రిగారు మొదలు పెట్టారు.

"లేకపోతే మరొకడైతే యీ ప్రయాణం మానుకొనేవాడు" అని రాజు చాకచక్యాన్నీ, పట్టుదలనీ ధైర్యసాహసాలను మెచ్చుకొంటున్నారు. "అబ్బ! ఏమిధైర్యమండీ ఆయనకు? చివరివరకు ఆయనకు సెలవుదొరికేటట్టు లేకపోయినా వెళ్లితీరతాను అని చెప్తూనేఉన్నాడు" అని శాస్త్రిగారిభార్య పలికింది.

"అంత మొండి పట్టుదల రాజుది. కనకనే సాధించాడు. రాజుగురించి రెడ్డి బెంగపెట్టుకున్నాడు. ఇంతాచేసి ఈ ప్రయాణ సాగుతుందో లేదో అని." జాన్ మరి కొన్ని వివరాలు చెప్తున్నాడు. నాకు తెలుసు. నాలుగు మాసాలనించి ఈ ప్రయాణంకోసం సన్నాహాలు చేస్తున్నాము, ఇప్పటికి కార్యరూపంలోకి వచ్చింది.

అసలు ఎలిజబెతురాణి పట్టాభిషేక మహోత్సవం నాటికి లండనులో ఉండాలని వీరిద్దరి సంకల్పం. అది సాధ్యంకానేలేదు. అని నేను చెప్తూ ఉంటే శాస్త్రిగారిభార్య అడ్డువచ్చి- "ఆ ఉత్సవంచూచే అవకాశం వీరికి ప్రాప్తిలేకపోతే ఏంచేస్తారు" అన్నది.

ప్రాప్తిలేదు. అందుకే రాజుకి రావలసిన సెలవు కడపటిదినంవరకూ రానేలేదు. ఈలోపున ఎన్నో ఓడలమీద చేసిన ప్రయాణం బుక్కింగులు రద్దుచేయవలసి వచ్చింది. రాజు శనివారం నాడు ప్రారంభం కానున్న డాక్టర్ల మహాసభలో పాల్గొనే నిమిత్తం ఆనాటికే లండన్ చేరుకోవాలి. కాని లక్ష్మివారం రాత్రివరకు వాళ్ళకు కదిలే అవకాశమే లేకపోయింది. మంగళవారం సెలవుదొరికింది. బుధవారం తాను ఉద్యోగం చేస్తూ ఉన్న చోటికిపోయి ఛార్జివప్పగించివస్తే తప్ప విడుదలలేదు. రాజు విదేశాలకు పోవడం అతని పై అధికారులకు ఇష్టంలేదు. పైగా అసూయ. ఇతడు పోవడమేం, మనం యెందుకు పోకూడదని వారివాదం. ఆ అధికార్లని ఎవరు పంపుతారు? పంపినా పోగలధైర్యం వాళ్ళకి ఎక్కడ ఉన్నది?

సత్యనారాయణ "శ్రీవాత్సవ"

"శ్రేయోంసి బహు విఘ్నాని అని సామెత లెండి" అని శాస్త్రిగారి భార్య మళ్ళా అందుకొన్నది.

జాన్ రెడ్డిసంగతి చెప్తూన్నాడు. రెడ్డి ఆరోగ్యం బాగా ఉండటంలేదు. ఎన్ని మందులు తిన్నా-ఎన్ని తిండ్లు తిన్నా రెడ్డికి బలంచేయడం లేదు. విమానాశ్రయంలో అతని బరువుతూస్తే 101 పౌనులు. ఇంతతక్కువా అని ఆశ్చర్య పడ్డాము. రెడ్డి సరదా పురుషుడు. ధనవంతుడు. ధనమున్నందుకు దానిని చక్కగా ఎప్పుడు ఎలాగ ఖర్చుపెట్టి ఎలాగ ఆనందించాలో తెలుసు. అతనికి విదేశాలుపోయి పర్యటన చేసిరావాలని - వ్యాపార రహస్యాలు తెలుసుకోవాలని అభిలాష ఉన్నది. ఆరోగ్యంకూడా బాగుపడుతుందేమో అని ఆశ ఉన్నది. అందుకే యీ ప్రయాణం మీద బయలుదేరాడు. అయితే రెడ్డికి భాషలు రావు. ప్రయాణానుభవం లేదు. రాజు అనుభవశాలి. యుద్ధంలో పనిచేసి వచ్చినవాడు. దేశదేశాలు చూచినవాడు. ఇదివరకు ఇంగ్లాండు, యూరపుదేశాలు పర్యటనచేసి వచ్చినవాడు. ఆ కారణంచేత అతని సహాయం కోరాడు. రెండు సంవత్సరాలనించీ చేస్తున్న ప్రయత్నాలు యీనాటికి ఫలించాయి.

"దేనికైనా కాలమూ కర్మమూ కూడిరావాలి కదా!" అని శాస్త్రిగారిభార్య చెప్పుతూ ఉన్నది.

"మీకు ఇటువంటివాటిమీద నమ్మకం ఉందా యేమిటి?" అని జాన్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"చాలా నమ్మకం! మన కందరికీ నమ్మకం ఉండాలేమో అదిలేకపోతే అసలు బ్రతకలేము ఏమో!" అని శాస్త్రిగారు అన్నారు.

"ఏమో! కాలం కర్మం అనీ విధి అనీ ఏవో బయటిశక్తులమీద నమ్మకం ఉంచుకొనేకంటే మనశక్తిమీద మనకు విశ్వాసం ఉంచుకొంటే ఎక్కువ సులువుగా మనజీవితాన్ని ఆనందమయం చేసుకోగలం ఏమో" అని జాన్ అన్నాడు.

"అదీ నిజమే కాని జాన్, మనకెంతనమ్మకమున్నా బలీయమైన విధిమీదకూడా నమ్మకం నిలుపుకోవాలేమో" అని శాస్త్రిగారి భార్య సంగతి చెప్పింది.

"ఉదాహరణకు ఈ ప్రయాణం మాటే తీసుకోండి. వీరిని సాగనంపడానికి రావాలని మేము వస్తున్నామా? పెట్రోలు లేదని యింటిదగ్గర చూడలేదు. ఇక్కడదాకా వచ్చిన తర్వాత రెండుమైళ్ళ దూరంలో బండి నిలిచిపోయింది. పెట్రోలు లేదని తెలిసింది. చుట్టుప్రక్కల పెట్రోలు బంకులేదు. మరొకబండి దొరకలేదు. ఏమి చేయడానికీ తోచలేదు. ఇంక పదినిమిషాల వ్యవధి వున్నది. అయ్యో! మనం చూడకుండానే యీ మిత్రులు దూరప్రయాణం వెళ్ళిపోతున్నారేమో అనిపించింది. ఏమీ ఉపాయం కనిపించలేదు. ఇంతలో ఒకలారీ ఏమో సామానుతో ఆ దారిని పోతూవున్నది. శాస్త్రిగారు లారీని నిలిపివేసి వారితో సంగతంతా చెప్పారు. ఆ లారీ డ్రైవరు పాపం సానుభూతితో మమ్మల్ని ఎక్కించుకొన్నాడు. ఇక్కడికి వచ్చాం! ఇంకా అయిదునిమిషాల టయిమున్నది. ఫోటోలుకూడా తీసుకున్నాం" అని శాస్త్రిగారి భార్య చెపుతూ ఉన్నారు.

"ఇక్కడికి వచ్చికూడా వీరి ప్రయాణం మాట ఆలోచించకుండా నిలిచిపోయిన కారూ అందులో పెట్రోలు ఈ సంగతి గురించి ఆయన మథనపడతారే" అని జాన్ విమర్శిస్తున్నాడు.

"ఆయనెప్పుడూ అంతేలెండి. ఏది ముఖ్యమో తెలియదు" అని శాస్త్రిగారి భార్య అన్నది.

"చివరకి ఈ ప్రయాణం ఎలాగ ఉన్నప్పటికీ మీరిచ్చిన చాక్లెట్లు వారు జ్ఞాపకం పెట్టుకొంటారులెండి" అని నేను అన్నాను. అంతా నవ్వుకొన్నాము. ఎవరిదారిని వారు వచ్చేశాము.

ఒక వారంరోజులు పోయిన తర్వాత రాజు, రెడ్డీ క్షేమంగా అనుకొన్న శనివారంనాటికి లండన్ చేరినట్లు-అన్నీ సవ్యంగా జరిగినట్లు ఉత్తరం వచ్చింది. మళ్ళా శాస్త్రిగారు కనిపించారు. "ఏమయ్యా! మనవాళ్లు చేరినట్లు ఉత్తరాలు వచ్చాయా?" అని అడిగారు. ఒక పెద్ద నీలిరంగు కవరుతీసి ఆయనకిచ్చాను. అందులో రాజు వాళ్ల ప్రయాణం వర్ణించాడు.

"మొత్తంమీద రాజు అంటే ఉద్దండుడు. తలచుకొన్న పని సాధించి తీరుతాడు" అని శాస్త్రిగారు అన్నారు.

"అంతకంటె విధిమీద భగవంతునిమీద రాజుకి గల విశ్వాసం చూడండి."

"మరే-ఈ మాటలన్నీ మా ఆవిడతో చెప్ప వచ్చు. ఈవేళ సాయంకాలం మా యింటికి టీకి రాకూడదూ?" అని శాస్త్రిగారు పిలిచారు.

ఆవేళ శాస్త్రిగారింట్లో మేము నలుగురమూ కలుసుకొన్నాము. అక్కడ మరొక కొత్త వ్యక్తి పరిచయమయ్యాడు. ఆయన నిరంజన ఆనంద స్వామి అని ఒక యోగి. అన్ని ధర్మశాస్త్రాలూ చదువుకొన్నాడు. ఇటు పాశ్చాత్య తత్త్వశాస్త్ర ములో పట్టభద్రుడు. హిందూ ధర్మశాస్త్రాలన్నీ కూలంకషంగా తెలుసుకొని వాటిలోని రహస్య ములను ఆచరణయుక్తంగా అమలు జరుపుతూ ఉన్నవాడు. తర్కము, వేదాంతం, మీమాంస మొదలయినవే కాక జ్యోతిషం, ఖగోళశాస్త్రం, గణితం మొదలయినవి తెలిసినవాడు. నేను-రాజు ప్రయాణం సంగతి చెపుతూ ఉంటే ఆయన కూడా శ్రద్ధగా విన్నాడు.

రాజు ప్రయాణంలో కలిగిన ప్రతిబంధకాలు-డెకోటా విమానంలో ఎక్కి మద్రాసు మీనం బాకం విమానాశ్రయం విడిచివెళ్లడంతో పూర్తి కాలేదు. ఆ విమానంలో బయలుదేరి నాగ పూరులో మారి బొంబాయి చేరుకొన్నారు. అక్కడ మరొక విమానంలోకి మారాలి. అది జెట్ విమానం అయితేతప్ప - రాజు అనుకొన్న గడువులో లండన్ చేరుకోవడానికి వీలులేదు. రాజూ, రెడ్డీ జెట్ విమానంలో ప్రయాణం చేయ డానికి సిద్ధంగా వేఉన్నారు. ఎంత అపాయంతో కూడుకొన్నాసరే. కాని ఆ విమానంలో సీట్లు లేవు. ఒక్కరికి మాత్రమే చోటు ఉన్నది. మద్రాసులో ఆ కంపెనీ యేజంటు చెప్పిన ప్రకారం బొంబాయి వెళ్ళి ప్రయత్నంచేస్తే దొరుకుతుందేమో అన్నాడు. చూచారు. అక్కడ కూడా చోటులేదు. కరాచీవరకు రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయట. ముందు కరాచీ వెళ్ళి చూద్దాం. తరువాత దేవుడిమీదనే భారంవేద్దాం అనుకొన్నారట. ఈ బాధలన్నీ వర్ణిస్తూ రాజు యిలాగ వ్రాశాడు తన ఉత్తరంలో:

"బొంబాయిలో మేం దిగినతర్వాత చోటు దొరక్కపోతే చాల నిరుత్సాహపడ్డాం. రెడ్డి పెదవి విరుస్తున్నాడు. నేను ధైర్యం చెప్పాను. మా ప్యాస్‌పోర్టులలో కరాచీలో దిగడానికి తిరిగి 'వీసా' సంపాదించాలి. అదొక పెద్దప్రయత్నం. ఎంతమందినో కలుసుకొన్నాం. ఎన్ని చోట్లలో తిరిగాం. చివరికి కొండనుపట్టి ఎలుకను సాధిం చాము. పాకిస్తాన్ కాన్సలేటువద్దనించి కరాచీలో దిగడానికి విసాలు సంపాదించాం. బొంబాయిలో శుక్రవారం అయినన్నరకు బయలుదేరి మరొక గంటలో కరాచీలో దిగాం. అక్కడ భగవంతుని మీద భారంవేసి కాచుకొనిఉన్నాం. ఆస్ట్రేలియా నించి యూరప్ పోయే విమానం వస్తుందట. భగవంతునిమీద నాకున్నంత విశ్వాసం ఇంకెవ్వరికీ ఉండదేమో! మన అవసర సమయాల్లో భగవం తుడు ఆదుకొని - మనకి జరగవలసిన విధాల సహాయంచేస్తాడని నా నమ్మకం. అలాగేజరిగింది. ఆస్ట్రేలియానించి వచ్చిన విమానంలో మాకిద్దరికీ చోటు ఉన్నది. ఈ విమానం స్విట్జర్లాండులో ఆగి, లండన్ చేరుకొంటుంది. అందులోఎక్కాం. మేము పోవలసిన టయిముకి కొన్ని గంటలు ముందుగానే లండన్ చేరుకొన్నాం. అనుకొన్న సమయానికి ఏర్పరచిన విందులో పాల్గొన్నాం. ఎన్ని కష్టాలుపడినా చివరికి బాగానే జరిగింది" అని ఉత్తరంలో ఉన్నది.

"రాజుకి ఎంత సాహసం - జెట్ విమానంలో వెళ్లడం, నిరపాయంగా అనుకొన్న సమయానికి చేరుకోవడం" అని శాస్త్రిగారి భార్య అన్నది.

శాస్త్రి "అతను అటువంటివాడే. నాకు మొదటి నించీ తెలుసు. అతడు అదృష్ట జాతకుడు" అని అన్నారు.

"మీకు జాతకాలలో నమ్మకముందండి శాస్త్రి గారు" అని జాన్ అడుగుతున్నాడు.

"ఆ మాట శాస్త్రిగారిని కాదు. స్వామీజీని అడగండి" అని శాస్త్రిగారి భార్య స్వామీజీని మాటలాడించడానికి ప్రయత్నం చేసింది.

"జాతకంమీద నమ్మకంలేదంటే యెలాగండీ! మన జీవితాలు అన్నీ ముందు నిర్ణయించిన ప్లాను ప్రకారం జరిగిపోవలసిందే. ఏర్పరచిన గీతల ప్రకారం ఉయా గడులలో-తు.చ. తప్ప కుండా నడచిపోక తప్పదు" అని శాస్త్రిగా రన్నారు. "లేకపోతే, అమెరికాలో బోస్టన్

నగరంనించి వచ్చిన క్రిస్టీ అనే అమ్మాయి మాట చూడండి. పాపం మొన్నటిరోజున కలకత్తాలో డమ్‌డమ్ విమానాశ్రయంలో కామెట్ విమానంలో రావలసింది. ఆఖరి క్షణంలో ప్రయాణం రద్దు అయింది. ఆ కామెట్ విమానంలో ఉన్న ప్రయాణీకులందరూ భస్మీపటలం అయిపోతే ఈ అమ్మాయి బ్రతికి బయటపడింది అనుకొంటే మరొక విమానంలో ఢిల్లీ వెళ్ళి, ఢిల్లీలో యింకో విమానం యెక్కి బొంబాయి వెళ్లబోతూ-అది ముక్కలయి తన ప్రాణాలను కోల్పోయింది. మృత్యువు వెంటాడుతూ ఉన్న సమయంలో తప్పించుకొని తిరగడం ఎవరికీ సాధ్యం కాదు. ఇవన్నీ జాతక చక్రంలో ముందే నిర్ణయం అయిపోతాయి. ఏమంటారు స్వామీజీ" అని నేను అడిగాను. స్వామీజీ చిరునవ్వు నవ్వారు. ఏమీ బదులు చెప్పలేదు. "అయితే జాతకచక్రం చూసి యిలాగ యిలాగ జాతకుడి జీవితంలో జరుగుతుందని నిశ్చయంగా చెప్పగలరంటారా?" అని జాన్ ప్రశ్న వేశాడు.

## 2

స్వామీజీ తన గంభీర కంఠస్వరంతో మౌనముద్ర భేదించి చెప్పడం మొదలుపెట్టారు. మేము నలుగురమూ నిశ్చేష్టులమై - నిశ్శబ్దంగా ఆయన చెప్పిన మాటలు మంత్రముగ్ధులములాగ శ్రద్ధతో వింటున్నాము.

నిరంజనానందస్వామి జాతకంగురించి ప్రసంగిస్తున్నారు. ఈ లోకంలో జన్మించిన ప్రతి వ్యక్తికీ-జననీ గర్భంనుండి బయలువెడలి శిరస్సు కనిపించినప్పటినించీ యీ యిహలోకంలో అతని జీవితం నిర్ణీతమైపోయి ఉంటుంది. ఇది అతడి నుదుటిమీద బ్రహ్మ వ్రాసిన వ్రాత అంటారు. ఎంత చింతించినా యీ నుదుటివ్రాత తప్పించలేమంటారు మన హిందువులు. ఈ వ్రాత ప్రకారం అక్షరాలా జీవితవృత్తం జరిగిపోవలసిందే. శిలాశాసనం వంటిది. దీనిని చెరపడం ఎవరితరమూ కాదు. అయితే యిలాగ వ్రాసింది ముందే చదవడం ఎవరికైనా సాధ్యమవుతుందా అని ప్రశ్నించవచ్చు. ఈ ప్రశ్నకి సమాధానం అవుతుందీ అనీ కాదు అనీ కూడ చెప్పవచ్చు. మానవుని జీవితం అతని ఒకనిమీదనే గాక అతడి పరిసరాలమీద సంఘంమీద-పరిచితులయిన వ్యక్తులమీదకూడా ఆధారపడివున్నది. వీటి అన్నిటితో కలిగే ఘర్షణమే మానవ జీవిత చరిత్రగా రూపొందుతూ ఉన్నది. ఇవన్నీ మనకు అర్థమయ్యే పరిసరాలు, పరిస్థితులు. కొన్ని పరిసరాలలో కొన్ని పరిస్థితులలో కొన్ని సన్నివేశాలలో మానవుని నిలిపినపుడు అతడు ఒక విధంగా ప్రవర్తిస్తాడని మనం భావిస్తాం. సాధారణంగా మానవుడు మనం భావించినట్టే ప్రవర్తిస్తాడు. కాని ఒక్కొక్కసారి మన భావనలకు పూర్తిగా భిన్నంగా ప్రవర్తిస్తాడు. ఒకోసారి మానవుడికి తానేమిచేస్తే, ఏ ఫలితం అనుభవిస్తూ ఉన్నాడో తెలియకుండానే ప్రవర్తిస్తూ ఉంటాడు. అందుచేత మరుక్షణంలో ఏమి జరుగుతుందో తనకు తానే తెలుసుకోలేడు. మరొకరు ఎలాగు చెప్పగలరు?

కాని కొందరు మేధావంతులు, పంచభూతాలయిన పృథివి, వాయువు, నీరు, తేజస్సు ఆకాశాలతోకూడిన యీ ప్రపంచంలో కొన్నిటి యొక్క ప్రభావం మావవ జీవితాలపై యెలాగ పనిచేస్తుందో పరిశీలించారు. పరిశోధనలు చేశారు. ఫలితాలు సేకరించి సూత్రీకరించారు. అదేయొక శాస్త్రమయింది. నవగ్రహాలు వాటి చారముల వల్ల మానవుని జన్మ జరిగిన తరవాత జీవితం ఎలాగ ఉంటుందో అంచనావేశారు. అది చాలవరకు నిజమయింది. శాస్త్రం తప్పు అవడానికి వీలులేదు. ఆ శాస్త్రాన్ని అవగాహన చేసుకోవడంలోను దాని ఫలితాలు జీవితయథార్థాలకి సమన్వయపరచి చెప్పడంలోను నేర్పు ఉంటుంది. అది అందరికీ అలవడదు. నేర్పుగలవారుకూడ సరియైన మార్గంలో ఫలితాలు నిర్వచింపలేకపోతే అనేక దోషాలు జరుగుతాయి. ఇది నిరూపించడానికి మీకు ఒక చిన్న దృష్టాంతం చెప్పుతాను. జ్యోతిశ్శాస్త్రంకూడా ఇతర శాస్త్రజ్ఞానంలాగే ఒక మహత్తరశక్తి, ఈశక్తిని వినాశనానికీ ఉపయోగించవచ్చు. వినూతన సృష్టికీ ప్రయోగించవచ్చు. అణుశక్తిలాగ, అది ప్రయోగించేవారిమీద ఆధారపడి ఉంటుంది. ఈ శక్తిని దుర్వినియోగంచేసి దోషాలుచేసినవారిని చూచి అసలు

శాస్త్రాన్నే అసంగతం అని నిందించడం పొరపాటు.

ఇది యథార్థంగా జరిగిన కథ. నాకు బాగా తెలిసిన కుటుంబంవారిది. ఆయన నాతో కలిసి చదువుకొన్నవాడు. వియ్యన్న పంతులుగారని రంగాపురంలో కరణీకం చేసేవాడు. బాగా ధనం సంపాదించి ఉంచాడు. ఆయనకు సుశీల సౌభాగ్యవతి అయిన యిల్లాలు సుభద్రమ్మగారు. పూర్వకాలపు పెళ్ళిళ్ళు—చిన్న తనంలోనే చేశారు. ఆ తల్లి కాపురానికి వచ్చినప్పటినించీ అన్నీ చక్కగానే ఉన్నవి. అష్టయిశ్వర్యాలతో ఆ దంపతులు తులతూగుతూ సమస్త భాగ్యభోగ్యాలూ అనుభవిస్తున్నారు. కాని ఒక టేలోపం. ఆ తల్లికి సుపుత్రప్రాప్తిమాత్రం కలగలేదు. పుత్రుడు కలిగితే తప్ప హిందూ దాంపత్యజీవనానికి సిద్ధిలేదు కనక-పుత్రవాంఛ తీర్చుకోవడానికి ఆ దంపతులు పూజలు చేశారు. వ్రతాలు చేశారు. తీర్థయాత్రలు చేశారు. నవగ్రహ శాంతి చేయించారు. కరణం వియన్న పంతులుగారు తన జాతకం పండితులకు చూపించారు. కొందరు బిడ్డ కలుగుతాడన్నారు. కొందరు అసలు బిడ్డలే కలగరు, ఎవరినైనా పెంచుకోవాలి, దత్త పుత్రయోగం ఉందన్నారు. ఇంతకీ ఆయన జాతకం సరియైనదికాదు. లగ్నం ఏదో సరిగా నిర్ణయం జరగలేదు. లగ్న సంధి సింహం అని ఒకరు కర్కాటకం అని మరొకరు. దానితో ఫలితాలు పూర్తిగా మారిపోయాయి. ఏసమయానికి పెట్టాడో ఆయనకు తెలియదు. ఇదివరకు వ్రాసి పెట్టినవారు అసందిగ్ధంగా వ్రాసి ఉంచలేదు. దానితో ఎన్నో అనుమానాలు వచ్చాయి. ఇదేమీ బాగాలేదని-భార్యా భర్తలు ఇద్దరూ మద్రాసు వెళ్ళి పెద్ద ఆసుపత్రిలో పరీక్ష చేయించుకొన్నారు. సుభద్రమ్మగారికి ఒక చిన్న ఆపరేషన్ చెయ్యాలంటే అదికూడా చేయించారు. కాని వెంటనే ఆమె కడుపు ఫలించలేదు.

ఏమీ తోచకుండా యిలాగ కూర్చోవడం బాగాలేదని చెప్పి, సుభద్రమ్మగారికి సంగీతం అంటే అభిమానం అవడంచేత ఆమె అధ్యాత్మ రామాయణ కీర్తనలు - అష్టపదులు, తరంగాలు మొదలయినవి పాడుకొనేది. ఆ ఊరిలోనే ఉన్న ఒక హరిదాసుగారు రామమూర్తి భాగవతారు వచ్చి నేర్పించేవాడు. మన కరణంగారికీ తన భార్య తీయని కంఠస్వరంతో ఆ భక్తి గీతాలు పాడుతూ ఉండటం ఆనందంగానే ఉండేది. ఆయనకి తీరిక యెక్కడ? ఎంతసేపు కచేరిచావడిలోనే కాలక్షేపం. చీటికీమాటికీ తాలుకాఫీసుకీ, రిజిస్ట్రారు ఆఫీసుకీ వెళ్తూ ఉండాలి. ఎప్పుడైనా తీరికసమయంలో వచ్చిచూస్తే దాసుగారుచెప్పడం పెద్ద తంబురా శ్రుతిచేసుకొని తన సతీమణి పాడటం బాగానే ఉండేది. ఈ సంగీతం నేర్చుకొంటున్న తర్వాత సుభద్రమ్మకి ఇదివరకులేని శోభ-ఆనందం వచ్చాయి. మానవులకి తమలో అణగివున్న ప్రచ్ఛన్నశక్తులు, పరిపూర్ణవికాసం పొంది విలసిస్తూ ఉన్నవంటే వాటివల్ల కలిగే అనుభవంకంటె ఆనందం ఏముంటుంది? సుభద్రమ్మను ఒక్కోసారి చూస్తే వియ్యన్న పంతులుకికూడా ఒక కొత్త స్త్రీలాగు-ఒక అపరూప సుందరిలాగ కనిపించేది. తన పనుల తొందరలో, ఎన్నోసారులు తన భార్యలో సౌందర్యము గమనించకపోయినా, గమనించిన కమ్మని రాత్రులలో ఆమెతో సహచర్యాన్ని హృదయపూర్వకంగా ఆనందించి తన జీవితంలో పొందని సుధామాధుర్యాన్ని చవిచూచిన సమయాలు లేకపోలేదు. పంతులుకి భార్యగాని, జీవితంగాని, సంసారంగాని ఆధ్యాత్మిక అనుభవాలులాగ గోచరించలేదు. తాను కాల్చి పారవేస్తున్న లంక పొగాకు చుట్టలాగ, తాను రోజూ సరిదిద్ది దాఖలు చేస్తూఉన్న కరిణీకపు లెక్కలలాగు, అప్రయత్నంగా తాను సేకరిస్తూఉన్న ధనపురాసులలాగ కనిపించాయి. అందులో దైహిక భౌతిక వాసనలను తలదన్నిన అధి భౌతికశక్తి ఉందని గోచరించలేదు. అందుకే కరణంగారికి తన జీవితంగాని ఇతరుల జీవితాలుగాని తాను వాడుకొనే కలాలతో సమానంగా గోచరించాయి. అందుకే ఆయనకి తాను వాడుకొనే వస్తువుకే తానే సర్వస్వమని యెంచి తనని దైవసమానంగా పూజిస్తూ తన జీవితంలో అర్థభాగం పంచుకొని తన రక్తంలో భాగంకూడా పంచుకోవాలని చూస్తూఉన్న భార్యకా తారతమ్యం తెలియలేదు. ఆమె ధోరణి ఆమెది. ఆయన ధోరణి ఆయనది.

ఆ దంపతుల పూజలు ఫలించాయనండి. ఆ తల్లి చిరకాలమనోవాంఛ సిద్ధించింది. గర్భవతి అయింది. నిండు పేరోలగంతో సీమంతాలు అవి జరిపారు. నవమాసాలూ నిండిన తర్వాత ఒక మంచిరోజు ఉదయం కరణం వియ్యన్న పంతులు గారి భార్య సుభద్రమ్మగారు ఒక సుపుత్రుణ్ణి ప్రసవించింది. పిల్లవాడు - చిదిపిన దీపంలాగు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. ఈ శుభ వార్త విన్న వియ్యన్న పంతులుగారి ముఖం వికసించింది. వెంటనే ఆ గ్రామపురోహితులయినవారికి శిరోదయ సమయం అదీ చెప్పి జాతక చక్రం వేయించారు.

జాతక చక్రం దివ్యంగా ఉంది. మాచినవాళ్లు బాగానే ఉందన్నారు. కరణంగారికి తృప్తిగా లేదు. ఒక ప్రఖ్యాత ఓఢ్ర సిద్ధాంతివస్తే అయన అపరదైవజ్ఞులని వారికి చూపించారు. ఆయన పరిశీలించి అన్నీ చెప్పి, ఈ పుత్రుడి చేతిలో తండ్రి మృత్యువుతప్పదు అన్నట్టు తేల్చారు. అదీ కూడా మొదటి మూడు మాసాలలోనే పితృగండం అన్నారు. ఈ ఫలితాలు విన్నప్పటినించి కరణంగారికి పుత్రోదయంవల్ల కలగవలసిన ఆనందం లేదు. లోపల దహించుకొని పోతూఉన్నాడు, ఇన్నాళ్ళకు లేకలేక ఒక వంశాంకురం కలిగిందంటే దానివల్ల అసలు కుటుంబవృక్షానికే వినాశనహేతువు అంటే అతని భయం పట్టుకొంది. ఆ పుత్రుణ్ణి కన్నతల్లికి మొదట ఈ రహస్యం తెలియకపోయినా తర్వాత తర్వాత తెలిసింది. పితృగండంతో పుట్టిన తన పుత్రునిజూచి మహాపరాధినిలాగ ఆమెకూడ తపించిపోతూ ఉన్నది. లేకలేక కలిగిన యీ బిడ్డ, తన నోముల పంట, అంత తేజస్వి, స్ఫురద్రూపి, తనకు కాకుండా పోనాడకలదా?

"అబ్బా! ఆ జాతక చక్రంలో ఏం తప్పు వేశారోనండి! ఇవన్నీ నిజంకావు. ఈ సిద్ధాంతులు చెప్పినవన్నీ నిజమవుతాయా?" అని తన భర్తకు సమాధానం చెప్పబోయింది. కరణం కూడా వినీ విననట్టు ఆ మాటలు చెవిని బెట్టకుండానే తిరుగుతున్నాడు. ఒకనాటిరాత్రి చిత్రం జరిగింది. పెద్ద గాలివాన-హోరునవర్షం; ఉరుములు మెరుపులు. తల్లి బిడ్డను పక్కలో వేసుకొని అర్జునః ఫల్గుణా పార్థివా అని శ్లోకాలు చదువుతున్నది. కుంభవృష్టి వర్షంపడుతూనే ఉన్నది. బయట ప్రకృతిలో నున్న సంక్షోభం పంతులు మనస్సులో కూడా బయలుదేరింది. అతని మనస్సులో ఉరుములు మెరుపులు, తన ప్రాణానికి ప్రాణంఇస్తేనో? ఈ చిన్నవాడు, యీ మొలక, యీ గ్రుడ్డు తన నిండు ప్రాణాన్ని తీసుకుంటాడా? అసలువీడినే లేకుండా చేస్తేనో? మరొక పిల్లవాడుపుట్టాడు. కాయకోస్తే మరొక కాయ కాస్తుంది. అసలు చెట్టేలేకుండాపోతే? పోవడానికివీలులేదు. తాను బ్రతకాలి. తనకి వయస్సు మళ్ళలేదు. ముప్పై కూడా పూర్తికాలేదు. పూర్తి ఆయుస్సు వుంది. షష్టిపూర్తి చేసుకోవాలి. మరి యిదేమిటి? తనకి పుట్టిన ఏకైక పుత్రుడివల్ల పితృగండం! జరగడానికి వీలులేదు. మానవుడి స్వార్థం పెచ్చు పెరిగి నవ్వుకు-మస్తిష్క కులాయంలో పాప వాంఛల కాలసర్పాలు బుసలు కొట్టాయి. కుబుసాలువిప్పి విలయనృత్యం చేస్తాయి. వాటి క్షేమానికి భంగం కలగనక్కరలేదు. కనీసం స్వేచ్ఛకు భంగం కలిగినా కాని విషదంష్ట్రలతో కాటు వేస్తాయి. కరణం పంతులు మనస్సులో స్వార్థ విషసర్పం పడగ విప్పుకొన్నది. దానికి -కుమారుడు- భార్య కనిపించడంలేదు. తన మార్గానికి ఎదురు వచ్చిన వాడినే కాటు వెయ్యాలనే. వివేకం, సంయమం, అనురాగం,ఆత్మవిచక్షణ నశించాయి స్వార్థకాంక్ష తాను బ్రతికి తీరాలనే ప్రబలమైనఇచ్ఛ స్వయం నిర్ణయం-ఆత్మరక్షణ ప్రకోపించాయి. బరువుగా అడుగులువేస్తూ పగబట్టి మానవుడు పాకుతునివస్తున్నాడు. హోరునవర్షం కురుస్తూనే ఉన్నది. ఆ గదిలో తల్లి-తల్లిప్రక్కలో పాప, కనుమూసి నిద్రిస్తున్నారు. కరణం చటుక్కున వచ్చి - పాపను ఎత్తుకొన్నాడు. బిడ్డ క్యారుమన్నాడు. ఎదురుగా కొండిగట్టి కునుకుతూవున్న దీపం గాలికి పెద్దదయింది.

"అమ్మయ్యో!" అని తల్లి లేచింది. "అదేమిటి? నా బిడ్డను... నా బిడ్డను చంపకండి" అని ఎలుగెత్తి కేకలువేసింది. కరణంలోని మానవుడు మేలుకొన్నాడు. అంధకార కూపంలో వెయ్యిదీపాల విలక్షణ కాంతులు ప్రసరింపజేసినట్లయింది. బుసకొట్టూ ఉన్న పాములు మంత్రదండం చూచి

కట్టుతో నిలిచిపోయినట్టయింది. "అయ్యో!... అయ్యో!" అని తల్లి కేకలు వేస్తూ ఉంది.

"లేదు- ఈ ఉరుములూ మెఱుపులూ చూచి భయంవేసింది. చంటివాడిని చూచి పోదామని వచ్చాను. అదలిపోతాడేమోనని-అబ్బ! ఏమివర్షం ఎంత తుఫాను!"

"వాడికేం భయంలేదు. నా చిట్టితండ్రి, నా వరాలపట్టి! చెక్కుచెదరకుండా బొంగరంలాగ నిద్రపోతున్నాడు" అని తల్లి తిరిగి చిరునవ్వుతో బిడ్డను ఒడిలోకి తీసుకున్నది.

ఇది జరిగిన తర్వాత కరణంగారికి మనశ్శాంతి లేదు. ఎందరో సిద్ధాంతుల్ని ఆయన సంప్రతించారు. "మూడు మాసాలు వరకు చూడండి, తరవాత అడగండి" అన్నారు.

మూడు మాసాలు గడిచాయి. మళ్లీ వర్షమూ గాలీ. ఒకరోజున కరణంగారి యింట్లో కరణంగారి భార్యకి సంగీతం చెప్పిన హరిదాసుగారు బిడ్డను చూడటానికి వచ్చారు. బిడ్డను చూచి చాలా సంతోషించాడు. తల్లి బిడ్డను చూపి, "దాసుగారూ! వీడికి కూడా మీరు సంగీతం చెప్పి మీలాంటి విద్వాంసుణ్ణి చెయ్యాలి" అన్నది.

"నాలాంటి విద్వాంసుడేం కర్మ అమ్మా! సభల్లోకి వెళ్ళి కచ్చేరీలు చేసే విద్వాంసుణ్ణి చేస్తాను" అని చెప్పి వచ్చాడు. బయట వీధి చావడిలో కరణంగారివద్ద సెలవు తీసుకోనబోతే ఆయన ఒక పంచెలచాపు బహుమానం ఇచ్చారు. అప్పటికి సందెచీకటి పడింది. చూచుకోకుండా వస్తూ ఉంటే, సింహద్వారం వద్దకు వచ్చేసరికి వర్షానికి నాని ఉన్నదేమో ఎదురుగా ఉన్న దిరిశెనచెట్టు కొమ్మ విరిగిపడింది. అప్పటికి ఆయుస్సుమూడింది. సంగీతం చెప్పిన ఆ హరిదాసుగారు వస్తూ ఉంటే సరిగా ఆయన శిరస్సు పగిలి నిలుచున్న పాటున ప్రాణాలు వదిలివేశాడు.

కరణంగారికి యిది చిత్రంగానే ఉన్నది. పిల్లవాడు మూడు మాసాలవాడయింది. మూడు మాసాలకు పితృమారకం. తన ప్రాణం మీదకువచ్చింది. తాను చావలేదు. తనకు బదులు తన యింటికి వచ్చిన తన భార్యతో చనువుగా ఉంటూ వచ్చిన సంగీతం చెప్పిన దాసు ఆకస్మికంగామరణించాడు. దాసుకీ పిల్లవాడికీ ఏమి సంబంధం! పితృమారకం! ఈ దాసు పిల్లవాడి తండ్రి యేమో! ఎంత దారుణము! తన భార్య ఎంతద్రోహం చేసింది! తన్ను మోసంచేసి-యీ దాసుకి బిడ్డను కన్నదే. ఈ బిడ్డగాని తల్లిగాని యింక ఒక్కక్షణం కూడా తన యింట్లో ఉండడానికి వీలులేదు. ఇంతద్రోహులు. జాతకం నిజమయింది. కాని మరొక విధంగా, ఆశ్చర్యకరంగా రాత్రి తెల్లవార్లూ మథనపడ్డాడు. తెల్లవారింది. స్త్రీలోనిదౌర్బల్యం క్షమించరానిది. గదిలోనించి బయటకు వచ్చాడు. అప్పుడే సుభద్రమ్మగారు బిడ్డకు స్నానం చేయించి - ప్రక్కనిప్పుల కుంపటి పెట్టి సాంబ్రాణి దూపం వేస్తున్నది. బలవంతంగా బిడ్డను కాలితో తన్నాడు. "పో! నీచురాలా! నీవు, నీ బిడ్డా నాయిల్లు వదలి పోండి-నాకింతద్రోహంచేసి ఇక్కడ మీరొక్కక్షణం ఉండటానికి వీలులేదు"అని ఆ పిల్లవాడిని త్రోశాడు. ఆ పిల్లవాడి చెయ్యి - భగభగమండుతూ ఉన్న కుంపటిలోపడింది. కాలిపోయి పొక్కులెక్కింది. బిడ్డ కేకలు వేస్తున్నాడు. తల్లి హడలిపోయి కేకలు వేస్తుంది. "అయ్యో! నావల్ల అపరాధం ఏమీలేదే, నేనేం చేశానండి. ఇదేమి పిచ్చండి మీకు?" అని అన్నది?

"అవును, నాకు పిచ్చే! నేను పిచ్చివాడిని కనకనే నాచాటున ఆ సంగీతం చెప్పినవాడికి బిడ్డను కన్నావు. పాపాత్మురాలా! రాక్షసీ పో!" అని అవతలకి గెంటి తరిమివేసి తలుపులు వేశాడు. వికృత వికటాట్టహాసంతో నవ్వుతున్నాడు.

చెయ్యి కాలిన బిడ్డను పట్టుకొని ఆ బిడ్డను వెంటవేసుకొని ఆ యిల్లాలు ఆసుపత్రికి పరుగెత్తింది. ఒకవారం రోజులు-ఆసుపత్రిలో వుండే వరకు ఆ బిడ్డకు తగ్గలేదు. వారంరోజులు గడచిన తరవాత- బిడ్డకు తగ్గిపోయింది. పెద్దమచ్చ చేతి నిండా అయిపోయింది. చేతికిమాత్రం వీలుగా అన్నిపనులూ చేయడానికి ప్రతిబంధం లేదని డాక్టరుగారు చెప్పారు.

ఈమాట విని-సుభద్రమ్మ అన్నవచ్చి ఆమెను పుట్టింటికి తీసుకొనిపోయాడు. ఆయన కోర్టుల పక్షి. తనబావ యిలాగ చేసినందుకు కోపం వచ్చి సుభద్రమ్మకు, బిడ్డకు భరణం నిమిత్తం కోర్టులో దావా వేశాడు. అయిదేళ్లు కోర్టులో సిద్ధాంత రాద్ధాంతాలు జరిగిన తరవాత సుభద్రమ్మకు-

భరణం యిచ్చి తీరాలని కోర్టువారు తీర్పును చెప్పారు. వియ్యన్న పంతులు-తన భార్యమీద వ్యభిచార నేరం కోర్టులో చెప్పలేదు. అది తన కడుపులోనే పెట్టుకొని దిగమ్రింగుకొన్నాడు. ఎంతోమంది రెండో పెళ్ళి చేసుకోమని చెప్పారు కాని ఆయన స్త్రీ జాతిమీదనే ద్వేషంతో పెళ్లి చేసుకోవడం మానివేశాడు. కాని తనఆస్తికీ, తన వంశానికీ ఉద్ధారకుడు అవసరం కనక ఒక దగ్గర బంధువుల బిడ్డను ఒకణ్ణి దత్తత చేసుకున్నాడు. ఈ సంగతి తెలిసి సుభద్రమ్మ చాలవిచారించింది.

ఈ లోపున కరణం వియ్యన్న పంతులుగారు తన జాతకమూ, తన పిల్లవాడి జాతకమూ ఎంతమంది పండితులకో చూపాడు. కొందరు - తనకి గండం లేదని, పూర్ణాయుర్దాయం ఉందని అన్నారు. మరికొందరు బాగా పరిశీలించి తండ్రి కొడుకులకు జన్మవైరం తప్పదని-కొడుకుచేతుల్లో తండ్రికిమృత్యువుతప్పదని అన్నారు. ఏదినిజమో తెలియక-ఆయన మాత్రం అతి జాగ్రత్తగా ప్రవర్తిస్తూ వచ్చాడు. దుష్టుడికి దూరంగా ఉండాలని తన దత్తత కుమారుని వెంటవేసుకొని పట్టణం వచ్చి అక్కడ చదువుల నిమిత్తం కాపురం చేస్తున్నాడు. తనకున్న ఆస్తిని కూర్చుండి తింటూ ఉంటే ఎన్నాళ్లు వస్తుంది. ఏరోజుకారోజు తరిగి పోతూ ఉంది. పెంపుడు కొడుకు చదువులకి ఎంతో వ్యయప్రయాసలకి లోనుగావలసివచ్చింది.

ఈ లోపున ఆ యిల్లాలు తన బిడ్డను-తన ప్రాణంలాగ చూచుకొంటూ పెంచుతూ ఉంది. ఆమె తండ్రి, అన్నదమ్ములూ, పుట్టింటిలో యితరులూ ఈ పిల్లవానిని అల్లారుముద్దుగా పెంచారు. విద్యాబుద్ధులు నేర్పించారు. పిల్లవాడు కూడా చాల చాకచక్యంగా చదువుకొని వైద్యశాస్త్రం అభ్యసించాడు. త్వరలోనే శస్త్రవిద్య నేర్చుకొని గొప్ప సర్జను అని పేరు సంపాదించాడు. యుద్ధకాలంలో సైన్యంలో పనిచేసి క్కెప్టెన్ హోదా పొందాడు. యుద్ధంనుంచి తిరిగి వచ్చిన తర్వాత తాను చదువుకొన్న ప్రాంతంలోనే ఉద్యోగరీత్యా తిరుగుతూ పనిచేసినచోట చేయకుండా మారుతూ ఉన్నాడు. ఇలాగ ముప్పైఖ సంవత్సరాల్లు గడిచిపోయింది.

వియ్యన్న పంతులు తన ఆస్తినంతా హారతి కర్పూరంలాగ హారించిపోగా దత్త పుత్రుడిమీద ఆధారపడి తిరుగుతూ ఉన్నాడు. అతగాడికి రివెన్యూ డిపార్టుమెంటులో నలగగా నలగగా డిప్యూటీ తహశీల్దారు ఉద్యోగం అయింది. మన్య ప్రాంతాలలో కొత్తగా ప్రారంభించిన ఆహార ఉత్పత్తిశాఖలో పనిచేస్తున్నాడు. తండ్రికి రుగ్మతగా ఉండి అతిమూత్రం యెక్కువవుతూ ఉంది. చివరికి-అరవైయో యేడు రాగానే అది రాచకురుపుగా పరిణమించింది. అది అంతకంతకు పెద్దదై విపరీతమైన బాధ పెడుతూ ఉంది. చిన్న చిన్న వైద్యులకి చూపిస్తే శస్త్ర చికిత్స చేసి తీరాలి అంటున్నారు.

ఇక లాభంలేదని-వారికి చేరువగా ఉన్న నగరంలోని ఆసుపత్రికి ముసలి పంతులిని తీసుకుని వెళ్ళారు. సర్జను తన వృత్తి ధర్మంప్రకారం పరీక్షచేశాడు. ఒక రోజు నిర్ణయించి అపుడు ఆపరేషను చేస్తానుఅన్నాడు. సర్జన్ ఆపరేషన్కు ముందు చేయవలసిన రక్తపుపోటు, మూత్ర పరీక్ష మొదలయినవన్నీ చేశాడు. వ్రణం భయంకరంగా ఉంది. తీరని బాధ, భరింపరాని దుర్గంధం, చీము నెత్తురు. వియ్యన్న పంతులు భరించలేకపోవడం సరేగదా అతని కుమారుడు, కోడలు-ఎవ్వరూ భరించలేకపోతున్నారు. పరిచర్యలు చేయలేక యీ ముసలివాడు పోయినా బాగుండును అంటున్నారు. సర్జను చేయవలసిన పరీక్షలు చేసిన తర్వాత యీయన ప్రాణంమాట చెప్పలేముగాని ఆపరేషన్ చేస్తాం, తర్వాత అదృష్టం అన్నారు. దత్తపుత్రుడు ఏమైనాసరే ఆపరేషన్ చేయవలసిందే అన్నాడు.

ఆపరేషన్కి అన్నీ సిద్ధమైనాయి, ఆపరేషన్ థియేటర్లో స్టవ్ మీద కత్తులు కట్టులు మొదలయినవి మరుగుతూ ఉన్నవి. ఆ గది అంతా ఆసుపత్రివాసన కొట్టూ ఉంది. పంతులుగారిని తీసుకొనివచ్చి ఆపరేషన్ టేబిల్ మీద పడుకోబెట్టారు. ఆపరేషన్ చేస్తున్నప్పుడు నొప్పితోచకుండా ఉండటానికి ఒక యింజక్షన్ ఇచ్చారు డాక్టరుగారు. ఇద్దరు నర్సులు- తెల్లటిదుస్తులతో చేతులకి తొడుగులు వేసుకుని ముఖానికి తలకి ముసుగులతో సిద్ధంగా ఉన్నారు. సర్జన్ చేతిమీద మచ్చ - కాలిపోయినమచ్చ, ముంజేతిని కమ్ము

కొని కనిపించింది. హాఁ-.సర్జన్‌గారి - చేతి మచ్చ, ముంజేతి మచ్చ!...

"మీ చేతిమీద ఆ మచ్చ ఏమిటి?" అని ఆయన అడిగాడు. చిన్నతనంలో- మూడవ మాసంలో కుంపటిలో చెయ్యిపడి కాలి యిలాగ మచ్చ ఆయిందట అని ఆయన చెప్పాడు. ఆ మాటలు చెప్పుతూ ఉండగానే ముప్పైఏసంవత్సరాలు ఒక్కసారి గిర్రున తిరిగినట్టయింది. ఆనాడు తన అసూయావేశ మనస్సుతో ఆగ్రహావేశంతో బిడ్డను కుంపటిలో తోసినదృశ్యం ఎదురుగా సాక్షాత్కరించింది. అంతక్రితం రెండుమాసాల గాలివానలో పిడుగులతో కూడిన భయంకర వర్షరాత్రి తాను తలపెట్టిన హత్యా ప్రయత్నం జ్ఞాపకం వచ్చింది. గుండె దిగజారి పోయింది. నీరసమైన గొంతుతో మీ తండ్రిగారి పేరేమిటండి?" అన్నాడు.

"వియ్యన్న పంతులు! రంగాపురం కరణం!"

"హాఁ ఇదా! కొడుకు చేతిలో మృత్యువు ఇదా" అనుకొన్నాడు. అని ఆయన్ని కౌగలించుకొని "నాయనా! సుభద్ర- మీ యమ్మ యెడల నేను చాల అన్యాయం చేశాను క్షమించు. వెర్రి అనుమానాలతో జాతకాలునమ్మి - భార్యాపుత్రులను వదలుకొన్న పాపాత్ముణ్ణి - నేనే ఆ వియ్యన్నను" అని చెప్పున్నాడు.

సర్జన్ కదలలేదు. తల్లికి కబురు పంపించాడు. ఈలోపున - ఆపరేషన్ చేశాడు. అతని ప్రజ్ఞ వల్ల ఆపరేషన్ జయప్రదంగానే జరిగింది. ఇంతలో సుభద్రమ్మగారు వచ్చారు. వియ్యన్న పంతులు నీరసంగా ఉన్నారు. ఆయన మత్తు మందు ప్రభావంవల్ల నిద్రలో ఉన్నారు. ఆయనకు మెలుకువ వచ్చేటప్పటికి - ఆ యిల్లాలు పరిచర్యచేస్తూ ఎదురుగా ఉంది.

కొద్దిరోజులకి ఆయనకి నిమ్మళించింది. భార్యాభర్తలిద్దరూ కలుసుకొన్నారు. ఈ సమావేశానికి కన్నకొడుకు పెంపుకుకొడుకూ సంతోషించారు. ఈ యానందాతిరేకంతో పంతులుగారి రక్తపుపోటు ఎక్కువయింది. మళ్ళీ గుండెపడ ఎక్కువయింది. వ్రణబాధపోయి మరొక కొత్త బాధ వచ్చింది. ఆ రక్తపుపోటు తగ్గడానికి, సిరల్లో ప్రవహించే రక్తంపోయేటట్టు అదికూడా సర్జన్ చేతులతో నేజరగవలసివచ్చింది.

కాని పోటు ఎక్కువై గుండె నీరసించి చివరికి ఆ వియ్యన్నపంతులు - పశ్చాత్తాపంపొంది చేసిన ఘోరాపరాధానికి పరితపించిన హృదయంతో- తన కొడుకు చేతుల్లోనే స్వయానా కన్నకొడుకు చేతుల్లోనే మరణించాడు. "అందుచేత ఎన్ని విధాల తప్పించుకొని చూడాలన్నా మన జీవితాలను నిర్ణయంచేసిన ప్రణాళిక మారదు. విధిని నుదుటవ్రాసిన వ్రాతను, జాతకాలను తప్పించుకోలేము." ఈ మాటలు- స్వామీజీ చెప్తూవుంటే మేమందరం ఒక సినిమాచిత్రం చూచిన వ్యక్తులలాగ ఏకాగ్రతతో విన్నాం.

అప్పుడా స్వామీజీ అన్నారు...

"అందుచేత జాతకచక్రం తప్పనిగాని, శాస్త్రంగాని ఏదో పొరపాటని చెప్పడానికి వీలులేదు. అది మన జీవితాలకు అన్వయపరచి అది యేమిటో నిర్వచింపగలిగినపుడే-దానియొక్కపూర్తి ప్రయోజనాన్ని పొందగల్గుతున్నాం. ఈ యబ్బాయి జాతకచక్రం చూస్తేనే యిది యిన్ని విధాల చెప్పడానికి అవకాశం కలిగిందో చూడవచ్చును"అని ఆయన జాతక కుండలి చేసి చూపించారు.

"దీనిప్రకారం జాతకుడి లగ్నం వృషభలగ్నం, నాలుగవస్థానంలో చంద్రుడు గురుడు వున్నారు. వ్యయస్థానంలో రవి శనులతోసహా కుజ రాహువులున్నారు. దానికితోడు పాపక్రూరుడు అయిన రవి ఉచ్చరాశిలో ఉండి, నీచలో పడిన శనితో కలవడంవల్ల ఇది యిలాగ జరిగింది. ఏకాదశస్థానంలో బుధ శుక్రులు కలిశారు. పితృకారకుడయిన రవి శత్రు స్థానాధిపతి అయిన శనితో కలవడంవల్ల- నైసర్గిక శత్రువులు తాత్కాలిక శత్రువులయి దుష్టగ్రహాలయిన కుజ రాహువులతో కలిశారు. అంతేగాక యీతని చేతులో రక్తస్రావంచేత తండ్రిచావు సంభవించింది. చతుర్థస్థానమైన మాతృ స్థానంలో చంద్ర గురులుండి మాతృసౌఖ్యం కలుగజేశారు. ఈ స్థానాధిపతి అయిన రవి పాపగ్రహాల నడుమ పోరాటంలో పడడంచేత ఆమెకు కష్టాలు తప్పవిసరి ఆయినవి."

ఇదంతా వింటూఉంటే మాకెవ్వరికీ జాతకం గురించి దానిమీద నమ్మకాలుగురించి ఉన్న సంశయాలన్నీ అంతరించిపోయాయి. ★